క్లుప్తంగా

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు : స్థానిక చిత్తూరు మార్గంలోని జ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల పీలేరులో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ రాధారాణి కోరారు. 5వ తరగతిలో 48 సీట్లు, 6వ తరగతిలో 10 సీట్లు, 7వ తరగతిలో 2 సీట్లు ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఈ నెల 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. వివరాలకు 9515120268 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం


నగదును అందజేస్తున్న మానవత సభ్యులు

మదనపల్లె సిటీ: గుర్రంకొండ మండలం తరిగొండ రేగడపల్లెకు చెందిన డ్రైవర్ జయంత్ బాబు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మానవత సంస్థ సభ్యులు స్పందించారు. జయంత్‌బాబు భార్య భానుప్రియకు ఆర్థిక సహాయం అందించారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో సభ్యులు రూ.20 వేలు నగదును అందించారు. జయంత్‌బాబు కిడ్నీలు పాడవడంతో తీవ్ర అనారోగ్యం గురికావడంతో ఆస్పత్రిలో చేరినట్లు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వారి కుటుంబానికి అండగా నిలుస్తామని తెలిపారు. మానవత సంస్థ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సభ్యులు నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు.

పరామర్శ


పూజారి శ్రీనివాసశాస్త్రిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : వాల్మీకిపురం పట్టణంలోని శ్రీపట్టాభిరామాలయ పూజారి రాయదుర్గం శ్రీనివాసశాస్త్రి ఇటీవల ప్రమాదానికి గురై మదనపల్లె రామిరెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకుని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శనివారం మదనపల్లెకు వెళ్ళి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పూజారిని పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగితెలుసుకున్నారు. అలాగే కలకడ మండలం, నవాబుపేట పంచాయతీ మండెం వారిపల్లె దళితవాడకు చెందిన సుబ్బమ్మ అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం తెలిసి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆమెను పరామర్శించారు. ఆమెకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని, అవసరమైతే ఉత్తమ వైద్యసేవలకు ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు.

విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

మదనపల్లె రూరల్ : మండలంలోని కృష్ణచైతన్య ఫార్మసీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు సర్టిఫికెట్ల విషయమై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కరస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...23 ఏళ్లుగా ఫార్మసీ కళాశాల విద్యార్థులను యాజమాన్యం ఎక్కడా ఎలాంటి ఇబ్బంది పెట్టలేదన్నారు. ప్రస్తుతం తాము గిట్టని వ్యక్తులు, కొంతమంది విద్యార్థులకు మాయమాటలు చెప్పి అధికారులకు ఫిర్యాదు చేయించారన్నారు. కళాశాల విద్యార్థులకు సంబంధించిన టెన్త్, ఇంటర్, ఆదాయ, కులధృవీకరణ పత్రాలు తమ వద్ద భద్రంగానే ఉన్నాయన్నారు. విద్యార్థులు సర్టిఫికేట్లు కావాల్సిందిగా రిక్వెస్ట్ లెటర్ రాస్తే...అందరికీ సర్టిఫికెట్లు ఇచ్చేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు గోపాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

షమీమ్‌అస్లాంకు డాక్టరేట్


గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న షమీమ్‌అస్లాం

మదనపల్లె రూరల్ : ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు షమీమ్‌అస్లాంకు భారత్ విర్చువల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన యూనివర్శిటీ ఫౌర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ డాక్టరేట్ల ప్రదానోత్సవంలో జి.షమీమ్‌అస్లాం సామాజిక సేవా విభాగంలో గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. 35ఏళ్లుగా ప్రజాసేవలో... 4 సార్లు మున్సిపల్ కౌన్సిలర్, వైస్‌చైర్మన్, మున్సిపల్ చైర్మన్, పీసీసీ జాయింట్ సెక్రటరీ, డీసీసీ మెంబర్, ఏపీఎండీసీ చైర్‌పర్సన్‌గా వివిధ హోదాల్లో ఆమె పనిచేశారు.

బుద్ధ విగ్రహం ధ్వంసం చేసిన

ఉన్మాదులను అరెస్ట్ చేయాలి

- పోలీసు వ్యవస్థ ప్రజల్లో నమ్మకం పెంచుకునేలా పనిచేయాలి
- ప్రజా ఉద్యమకారులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి


బుద్ధ విగ్రహం ధ్వంసం చేసిన ఉన్మాదులను అరెస్ట్ చేయాలని పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, ప్రజాసంఘాల నాయకులు

మదనపల్లె రూరల్ : మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ బుద్ధవిహార్‌లో బుద్ధ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఉన్మాదులను తక్షణమే పోలీసులు అరెస్ట్ చేయాలని వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో, మదనపల్లె ప్రజా సంఘాలతో కలిసి బుద్ధ విగ్రహ ధ్వంసం ఘటనపై మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రపంచ శాంతిదూత అయిన బుద్ధుడిని కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు గౌరవిస్తారన్నారు. గౌతమ బుద్ధుడి బోధనలను కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఇష్టపడతారని, అందుకే అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా గౌతమబుద్ధుడిని రాష్ట్రప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. అలాంటి మహనీయుడి విగ్రహాన్ని ఉన్మాదులు ధ్వంసం చేయడం శోచనీయమన్నారు. అన్నమయ్యజిల్లాలో ఏడాదికాలంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా పలు ఘటనలు జరుగుతున్నాయన్నారు. పోక్సో కేసులు, గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్, ఇసుక రవాణా తదితర నేరాలు ప్రతి రోజు ఎక్కడో ఒకచోట వెలుగుచూస్తూనే ఉన్నాయన్నారు. సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించి, న్యాయం కోసం వచ్చే బాధితులకు అండగా నిలవాల్సిన పోలీసులు వారిపైనే కేసులు పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజాస్వామ్యంలో పోలీసువ్యవస్థ పారదర్శకంగా పనిచేసినప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. బుద్ధుని విగ్రహం ధ్వంసం ఘటనలో న్యాయం కోరి వచ్చిన ప్రజాసంఘాలపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు పాల్పడటం ప్రభుత్వానికి తగదన్నారు. ప్రజాసంఘాలపై చర్యలను పోలీసులు ఉపసంహరించుకుని, తక్షణమే బుద్ధునికొండలో బుద్ధ విగ్రహాలకు భద్రత కల్పించేదిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మదనపల్లెలో మతసామరస్యంను పెంపొందించే విధంగా పోలీసువ్యవస్థ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ప్రసాద్‌బాబు, నాయకులు వెలుగుచంద్ర, జన్నేరాజేంద్రనాయుడు, కోటూరిఈశ్వర్, చాట్లబయన్న, నీరుగట్టి రమణ, తట్టి నాగరాజరెడ్డి, ఆర్టీఏ నూర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవిగ్రహం ధ్వంసం కేసులో విచారణకు సహకరించాలి

– తాలూకా సీఐ కళా వెంకటరమణ

మదనపల్లె రూరల్ : మండలంలోని అంకిశెట్టిపల్లె రెవెన్యూ గ్రామపరిధిలో బుద్ధుని విగ్రహం ధ్వంసం ఘటనకు సంబంధించి వీఆర్వో నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. ఘటనకు సంబంధించి ఎవరి దగ్గరైనా సమాచారం ఉంటే విచారణకు సహకరించాలని తాలూకా సీఐ కళావెంకటరమణ విజ్ఞప్తి చేశారు. శనివారం సీఐ కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో...అంకిశెట్టిపల్లె రెవెన్యూ గ్రామపరిధిలో సర్వేనెంబర్.15లోని ప్రభుత్వస్థలంలో నల్లగుట్టపై బుద్ధుని విగ్రహాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ విగ్రహాలు ఒక కొండపైన నిర్మానుష్య ప్రదేశంలో ఉండటంతో, జూలై 2వ తేదీకి ముందు బుద్ధుని విగ్రహం తలను తొలగించినట్లు వీఆర్వో ఫిర్యాదు మేరకు గుర్తించి విచారణ చేస్తున్నామన్నారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. జరిగిన ప్రదేశంలో టవర్ డంప్‌ను తీసుకుని, అదేవిధంగా అనుమానితుల వ్యక్తుల ఫోన్ నెంబర్లను పరిశీలిస్తున్నామన్నారు. కేసుకు సంబంధించి దర్యాప్తునకు ఏదైనా విలువైన సమాచారం ఉన్నట్లయితే, పోలీసులకు తెలిపితే, ఆకోణంలో విచారణ చేస్తామన్నారు. రెవెన్యూ అధికారుల రికార్డుల ప్రకారం బుద్ధుని విగ్రహం పగలగొట్టిన ప్రదేశం ప్రభుత్వ భూమిలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారన్నారు. నిర్మానుష్యమైన ప్రభుత్వభూమిలో విగ్రహాలను ఏర్పాటుచేసి, పోలీసులు సరిగ్గా స్పందించలేదని నిరాధారమైన ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. కొంతమంది వ్యక్తులు వర్గవిభేదాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వారు ఒకసారి ఆలోచించుకోవాలన్నారు. వారి వద్ద ఉన్న సమాచారం పోలీసులకు తెలిపితే వారి స్టేట్‌మెంట్స్ రికార్డు చేసుకుని దర్యాప్తు సాగిస్తామన్నారు. ఈ ఘటనపై మీడియాలో నిరసన వ్యక్తం చేస్తున్న వ్యక్తులు పోలీసులకు సహకరించడం లేదన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా ప్రెస్‌మీట్‌లు పెట్టడం భావ్యం కాదన్నారు.

ఎల్లమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ


అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ధర్మకర్త అశోక్‌కుమార్‌రెడ్డి దంపతులు

కలికిరి: ప్రసిద్ధిగాంచిన కలికిరి గ్రామ దేవత ఎల్లమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. శనివారం సాయంత్రం ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి దంపతులు సంప్రదాయ బద్ధంగా అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం రమణాచారి ఇంటి వద్ద నుంచి తెచ్చిన నగలతో ముందుగా అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. మంగళవాయిద్యాల నడుమ పట్టు వస్త్రాల సమర్పణతో జాతర ఉత్సవం ప్రారంభమైంది. రాత్రి జాగరణ, అమ్మవారి కథాకాలక్షేపం జరిగింది. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయం గర్భగుడి, పరిసరాలు విద్యుత్ దీపాలతో వెలుగులీనింది.

నేడు దీలు.. బోనాలు సమర్పణ

ఎల్లమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు ఆదివారం ఉదయం అమ్మవారు తేరులో పట్టణ పుర వీధులలో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. ఉదయం ఆలయం నుంచి తేరు ప్రారంభమై ఆర్‌ఎస్ రోడ్డు, బ్రాహ్మణ వీధి, బజారు వీధిలో అమ్మవారు ఊరేగుతారు. అనంతరం అమ్మవారు ఆలయానికి చేరుకున్నాక సిద్దపూజ నిర్వహించున్నారు. మధ్యాహ్నం నుంచి అమ్మవారికి భక్తాదులు దీలు, బోనాలు సమర్పించనున్నారు. రాత్రికి వివిధ ప్రాంతాల నుంచి చాందినీ బండ్లు ఊరేగింపుగా విచ్చేసి సోమవారం ఉదయం వరకు ఆలయానికి చేరుకుని ప్రదక్షిణల అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు చర్యలు చేపట్టారు. ప్రత్యేక క్యూలైనులు ఏర్పాటు చేశారు. జాతరలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్‌ను సైతం తపాశా కార్యాలయం మీదుగా సంతగేటు వీధి మీదుగా పాత సాయిబాబా ఆలయం వద్ద సోమల దారిలో కలిసేటట్లు పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, 177 మంది పోలీసు సిబ్బందిని జాతర బందోబస్తు నిమిత్తం కేటాయించినట్లు సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు.

బాబు పాలనలో మోసం గ్యారంటీ

- ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన కూటమి ప్రభుత్వం
- ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



బి.కొత్తకోట: చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా ప్రజలు మోసపోవడమన్నది గ్యారంటీ అని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విమర్శించారు. ఏడాదికే ప్రజల్లో వ్యతిరేకత తెచ్చుకున్న కూటమి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమైందన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని చేపట్టడంలో ఎలాంటి తప్పులేదన్నారు. చంద్రబాబు ఎన్నికల హామీల మోసాలపై క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజాభిప్రాయం సేకరించడం అంటే ప్రభుత్వంపై ప్రజల్లో మద్దతు ఉందా లేదా అన్నది స్పష్టం అవుతుందన్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు అబద్ధాలకు, మోసపు మాటలతో అధికారంలోకి రావడం తర్వాత ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబుకు మించిన బ్రాండ్ అంబాసిడర్ లేరన్నారు. సూపర్ సిక్స్ సహా 140 కిపైగా హామీలు ఇచ్చి ప్రజలకు ఎన్ని నెరవేర్చారని ప్రశ్నించారు. ఇంటిలో అందరు పిల్లలకు తల్లికి వందనం ఇస్తామంటూ కొర్రిలతో ఎందుకు మోసం చేశారని నిలదీశారు. సంక్షేమ కార్యక్రమాల అమలు, ఇచ్చిన మాట నిలుపుకోవడంలో జగన్‌మోహన్‌రెడ్డికి మించిన నాయకుడు మరొకరు లేరన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఇంటింటికి తీసుకెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు. కూటమికి ప్రజల ఆదరణ ఉంటే తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగించకుండా ఎందుకు అడ్డుకున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మెరుగైన సరఫరా కోసం ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఒక 132 విద్యుత్ కేంద్రం మంజూరు చేసి పనుల కోసం శంకుస్థాపన చేస్తే ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు. తంబళ్లపల్లె శాశ్వత కరువు నివారణ కోసం రూ.1,219 కోట్లతో హంద్రీ–నీవా పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులు చేపడితే పనులు రద్దు చేసి రైతాంగానికి తీరని ద్రోహం చేసి, సాగునీటి ఇబ్బందుల్లోకి నెట్టింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. రూ.500 కోట్లతో రహదారుల అభివృద్ధి చేపట్టగా అందులో మిగిలిన రహదారుల పనులను అడ్డుకుని మారుమూల ప్రజలకు రవాణా సౌకర్యం లేకుండా చేసి పెడుతున్న ఇబ్బందులను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం


హెచ్‌ఎంకు విరాళం చెక్కు అందజేస్తున్న దాత మధుకర్‌రెడ్డి

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు శనివారం ఎంఈఓ నాగసుబ్బరాయుడు, హెచ్‌ఎం మదన్‌మోహన్ తెలిపారు. మరిమిరెడ్డిగారిపల్లెకు చెందిన మధుకర్‌రెడ్డి, అనుపమ దంపతులు ఉద్యోగ రీత్యా నెదర్లాండ్‌లో ఉంటారు. పాఠశాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో రూ.లక్ష ఇచ్చినట్లు తెలిపారు. వారి దాతృత్వాన్ని ఎస్ఎంసీ చైర్మన్ రెడ్డిశేఖర్, ఉపాధ్యాయులు.తల్లిదండ్రులు అభినందించారు.

దూదేకుల సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న దూదేకుల సంక్షేమ సంఘం నాయకులు

పీలేరురూరల్ : దూదేకుల కులస్తులకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని ఇండియన్ ముస్లిం దూదేకుల / నూర్‌బాషా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగిడాల సిద్ధయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పద్మావతి నగర్‌లో దూదేకుల నూర్‌బాషా ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల దామాషా ప్రకారం రాజకీయ ప్రవేశాలు కల్పించాలని, ఇండియన్ ఇస్లాం దూదేకులుగా శాశ్వత ప్రభుత్వ జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ నిధి, మైనారిటీ బ్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీలేరు డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పసుపులేటి రహమత్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా వెంకిపల్లి మహమ్మద్ రఫీ, కోశాధికారిగా పి. ఖాదర్‌వల్లి, ఉపాధ్యక్షులుగా కాసల హనీఫ్, కార్యదర్శులుగా నజీర్, అల్తాఫ్, ఖాదర్‌వల్లి, చిన్నబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా డాక్టర్ వేంపల్లె అబ్దుల్‌ఖాదర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సామాజిక సేవకులకు అవార్డులు


అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు రాధామణి

మదనపల్లె సిటీ: ఉపాధ్యాయ వృత్తితో పాటు పలు సామాజిక సేవలు అందించినందుకు మదనపల్లెకు చెందిన ఉపాధ్యాయులు రాధామణి, మునిగోటి శ్రీనివాసశర్మలు తెలుగురత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సేవా మంజరి అవార్డులు అందుకున్నారు. కడపలోని సీపీ బ్రౌన్ జిల్లా గ్రంథాలయంలో జరిగిన సమావేశంలో రాధామణి, శ్రీనివాసశర్మలకు యోగి వేమన విద్యాలయం సీఈవో డాక్టర్ రత్నం అవార్డులు అందజేశారు. రాధామణి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘంలో సభ్యురాలిగా, మహిళా దినోత్సవంలో పాల్గొంటూ వివిధ కార్యక్రమాలకు సహాయ,సహకారాలు అందిస్తున్నారు. శ్రీనివాసశర్మ ఇటీవల పదవీ విరమణ చేసినా విద్యారంగానికి సేవలు అందిస్తున్నారు. వీరికి అవార్డులు రావడంపై పలు ఉపాధ్యాయ సంఘాలు హర్షం ప్రకటించాయి.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి


క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించి మాట్లాడుతున్న బండపల్లి అక్కులప్ప

మదనపల్లె రూరల్ : గ్రామీణ యువత రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని, జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు బండపల్లి అక్కులప్ప అన్నారు. మండలంలోని సీటీఎం క్రికెట్ మైదానంలో శనివారం ఎఫ్ఇసీసీ క్రికెట్ టోర్నమెంట్‌ను, బండపల్లి అక్కులప్ప ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. యువతలో ఉన్న ప్రతిభను వెలికితీయడం కోసం స్థానికంగా ఇలాంటి క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు చక్కటి ఆటతీరు కనపరిచి, సత్తా చాటాలన్నారు. టోర్నమెంట్‌లో మదనపల్లె పరిసర ప్రాంతాలకు చెందిన 9 టీమ్‌లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో మైఫోర్స్ స్పోర్ట్స్ డైరెక్టర్ శెట్టిపల్లి హరిబాబు, వినయ్‌కుమార్, మణికుమార్, అనిల్, ఈశ్వర్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న పైకప్పు


బస్‌స్టేషన్‌లో పెచ్చులూడుతున్న పైకప్పు

మదనపల్లె సిటీ: మదనపల్లె ఆర్టీసీ బస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. చిన్నపాటి వర్షం కురిస్తే నీటిమయంగా మారుతోంది. పైకప్పు పెచ్చులు ఊడిపడిపోతోంది. శ్లాబు పూర్తిగా దెబ్బతినింది. నిత్యం ప్రయాణికులు బస్టాండుకు వస్తుంటారు. ఏ సమయంలో ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం బస్టాండులో ప్లాట్‌ఫారం పనులు ప్రారంభించారు. దీంతో పాటు బస్‌స్టేషన్‌లోని పైకప్పు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు .

మహిళపై దాడి

మదనపల్లె రూరల్ : యువతీ యువకులు ప్రేమ వ్యవహారంలో భాగంగా యువతి తరపు బంధువులు యువకుడి తల్లిపై దాడిచేసిన ఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. బసినికొండ పంచాయతీ గంగన్నగారిపల్లెకు చెందిన మురళీ, నాగరత్నమ్మ(48) దంపతుల కుమారుడు చరణ్‌ను, బి.కొత్తకోటకు చెందిన యువతి బంధువుల ఇంటికి వచ్చి వెళుతూ ప్రేమించింది. ఈ క్రమంలో ఆరునెలల క్రితం ఇంటిలో చెప్పకుండా పారిపోయారు. అయితే కుటుంబసభ్యులు వారి ఆచూకీ తెలుసుకుని వారిని పిలుచుకువచ్చి వారి వారి ఇళ్లకు పంపేశారు. అయితే, రెండురోజుల క్రితం మరోసారి వారిద్దరూ పారిపోవడంతో గంగన్నగారిపల్లెలో ఉన్న యువతి బంధువులు విజయ్, భాస్కర్, చిన్నిలు, చరణ్ తల్లి నాగరత్నమ్మను ప్రశ్నించారు. వివాదం తలెత్తి ఆమెపై దాడిచేసి కొట్టారు. గాయపడిన ఆమెను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కాలువలో నిలబడి గ్రామస్తుల నిరసన

బి.కొత్తకోట: గ్రామం నుంచి పొలాలకు వెళ్లేందుకు కాలువపై బ్రిడ్జి నిర్మించలేదని హంద్రీ–నీవా కాలువలో దిగి గ్రామస్తులు శనివారం నిరసన తెలిపారు. బి.కొత్తకోట సమీపంలోని జనువవారిపల్లె నుంచి గ్రామస్తులు పొలాలకు రాకపోకలు సాగించేందుకు గతంలో ఇబ్బందులు ఉండేవికావు. ప్రస్తుతం లైనింగ్ పనులు చేస్తుండటంతో ఇబ్బంది మొదలైంది. దీనితో తమ గ్రామం వద్ద కాలువపై బ్రిడ్జిని నిర్మించి రాకపోకలకు సౌకర్యం కల్పించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ప్రాజెక్టు అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించలేదని, దీనిపై ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మొక్కల పెంపకంతోనే మానవమనుగడ



మొక్క నాటుతున్న హెచ్‌పీసీఎల్ చీఫ్ మేనేజర్, విద్యార్థులు

కలకడ : మొక్కల పెంపకంతోనే మానువ మనుగడ సాధ్యమని మండలంలోని హెచ్‌పీసీఎల్ కోన క్లస్టర్ స్టేషన్ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్, ప్లాంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కస్తూర్బాగాంధి బాలికల గురుకుల పాఠశాలలో మొక్కలు నాటారు. వాటిని పాఠశాల యాజమాన్యం కాపాడాలని కోరారు. ప్రతి విద్యార్థి వారి విద్యతో పాటు వారికి గుర్తుగా మొక్కను పెంచాలని సూచించారు. స్వచ్ఛత పాక్వాడ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలను, నీటివసతి ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి 200 మొక్కలను అందజేయనున్నట్లు తెలిపారు. మొక్కలను కాపాడేబాధ్యత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, యాజమాన్య కమిటీ సభ్యులదే అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు, హెచ్‌పీసీఎల్‌సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కలకడ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై కలకడ మండలం, బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లె వద్ద శనివారం ఉదయం చోటు చేసుకుంది. రాయచోటి నుంచి కలకడ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం అదే దారిలో వెళ్తున్న ట్రాక్టర్ వెనుక వైపు తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలానికి చెందిన జీవన్‌సాయి, గురుశ్రీనివాస్‌లు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108లో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ కట్టడాలు, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న బీవైఎస్ అధ్యక్షుడు పునీత్‌కుమార్

మదనపల్లె రూరల్ : పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి, ఆర్‌అండ్‌బీ స్థలంలోని అక్రమ కట్టడాలు, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బీవైఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఈనెల 2న బహుజన యువసేన ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ ఈఈ అరవిందాదేవికి, ప్రభుత్వ స్థలాల్లో అక్రమకట్టడాలు, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదుచేశామన్నారు. స్పందించిన ఈఈ, మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ అధికారులకు అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా సిఫార్సు చేస్తూ లేఖ పంపారన్నారు. దానిపై శనివారం ఉదయం తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి , తిరుపతిరోడ్డులో రహదారికి ఇరువైపులా ఉన్నటువంటి అక్రమ కట్టడాలను, ఆక్రమణలు వారంరోజుల్లో తొలగించాల్సిందిగా ఆదేశించడం అభినందనీయమన్నారు. వారంరోజుల్లోపు తొలగించకపోతే, తామే తొలగిస్తామని హెచ్చరించారన్నారు. గడువులోపు తొలగించని పక్షంలో రెవెన్యూ అధికారులు, వాటిపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడులకు గురికాకుండా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు హరీష్, జిలానీ, హరికృష్ణ, రెడ్డిశేఖర్, శ్రీనివాసులు, శశికుమార్, వినయ్, జగదీష్, కార్తీక్, దేవీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీనారసింహుడికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగు రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. చారిత్రాత్మక గుర్రంకొండ కోటలోని శ్రీ నృసింహస్వామి ఆలయంలో వేకువజామేన అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని స్వామివార్లను సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయఅర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.